క్లుప్తంగా

పల్లవిలో సైన్స్ ఫెయిర్


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

బడంగ్‌పేట్: బాచుపల్లిలోని పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్‌లో యురేకా పేరుతో సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. జీవ వైవిధ్య సాయసయాత్ర, ప్రకృతి వైపరీత్యాలు, మొక్కలు, జంతువుల్లో అడాప్టేషన్స్ అదేవిధంగా క్లిష్టమైన ప్రక్రియలు, బయోలజీలో వండర్‌ల్యాబ్, ఫిజిక్స్‌లో ఇగ్నైట్ ది మైండ్ వంటి నేటి సమాజానికి పనికి వచ్చే శాస్త్ర సాంకేతికతతో కూడిన నమూనాలను విద్యార్థులు ప్రదర్శించారు. విచ్చేసిన సందర్శకులు, తల్లితండ్రులు విద్యార్థుల్లో దాగివున్న విజ్ఞానాన్ని అభినందించారు. సైన్స్ ఫెయిర్‌లు మనో విజ్ఞానంతో పాటు మానసికంగా దాగివున్న విశేషాలను వెలికితీస్తాయని నిర్వాహకులు పేర్కొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథి శాంతి, డైరెక్టర్ సుశీల్‌కుమార్, ప్రిన్సిపాల్ అనురాధ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

గురుస్వామి సతీశ్‌నాయక్‌కు నివాళి


నివాళులర్పిస్తున్న అయ్యప్ప భక్తులు

మహేశ్వరం: గురుస్వామి సతీశ్‌నాయక్ అకాల మరణం అయ్యప్ప భక్తులకు తీరని లోటని పలువురు కొనియాడారు. ఆదివారం శంషాబాద్ మండలంలోని పాలమాకుల గ్రామంలో ఆయన స్వగృహంలో దశదినకర్మ కార్యక్రమానికి మహేశ్వరం మండలం నుంచి అయ్యప్ప భక్తులు భారీగా హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని కోరుకున్నామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో అయ్యప్ప భక్తులు ఠాకూర్ లక్ష్మణ్‌సింగ్, అంజయ్య, దేవవరం, రాఘవేందర్ గౌడ్, ఆంజనేయులు, వాసుదేవారెడ్డి, కుమార్ పలువురు పాల్గొన్నారు.

పాదయాత్రగా శ్రీశైలానికి..
బయలుదేరిన శివస్వాములు

ఆమనగల్లు: శివస్వాములు ఆమనగల్లు నుంచి శ్రీశైలం దేవస్థానానికి ఆదివారం కాలినడకన బయలుదేరారు. ముందుగా ఆమనగల్లు పట్టణంలోని శ్రీ భక్త మార్కండేయస్వామి ఆలయంలో శివస్వాముల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, యజ్ఞం నిర్వహించారు. అనంతరం గురుస్వాముల ఆధ్వర్యంలో శివస్వాములు ఇరుముడులు కట్టుకున్నారు. అనంతరం శివస్వాములు గణేశ్, అమర్, సాయి, మహేశ్, శివ, అంజి, నిఖిల్, వేణు, చింటు, వినోద్, అరవింద్, వికాస్, నందు తదితరులు కాలినడకన శ్రీశైలం బయలుదేరి వెళ్లారు.

మహాశివరాత్రికి ప్రత్యేక బ్యాడ్మింటన్ టోర్నీ

హయత్‌నగర్: మహాశివరాత్రి పండుగ సందర్భంగా గజ్జి యాదయ్య, రాజమ్మయాదవ్ జ్ఞాపకార్థం ఈనెల 8వ తేదీ సాయంత్రం నుంచి 9వ తేదీ ఉదయం వరకు హయత్‌నగర్‌లోని ఎస్‌వీఎస్ బ్యాడ్మింటన్ అకాడమీలో ప్రత్యేక షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గజ్జి నర్సింహ యాదవ్ తెలిపారు. ఈ టోర్నీలో విజేతలకు లక్ష రూపాయల నగదు బహుమతులు ఇస్తామని నగరంలోని నాన్ మెడలిస్టు క్రీడాకారులందరూ ఈ టోర్నమెంట్‌లో పాల్గొనవచ్చని ఆయన తెలిపారు. మెన్స్ డబుల్, 45 ప్లస్ విభాగంలో పోటీలు నిర్వహిస్తామని, ఆసక్తి గలవారు ఈ నెల 7 వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన సూచించారు. వివరాలకు ఫోన్ నం. 9704541579లో సంప్రదించవచ్చన్నారు.

పేద విద్యార్థుల చదువుకు చేయూత

చైతన్యపురి: నలుగురు మిత్ర బృందం పేద విద్యార్థులకు స్కూల్ ఫీజులు అందజేశారు. చైతన్యపురి డివిజన్‌లోని ఆదర్శ ఫౌండేషన్‌లో ఉంటున్న అనాథ పిల్లలు స్కూల్ ఫీజులు కట్టలేని స్థితిలో ఉన్నారని తెలుసుకున్న స్థానిక బీఆర్ఎస్ డివిజన్ నాయకుడు చంద్రశేఖర్ రెడ్డి తన మిత్రులు గంగాపురం ప్రసాదరెడ్డి, సంతోష్ గుప్తా, నరేందర్, సూర్యలతో కలిసి రూ. 45 వేలు వసతి గృహం ఇన్‌చార్జి జకియా ఫాతీమా, ప్రదీప్‌లకు అందజేశారు. పేద విద్యార్థుల చదువులకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో స్థానికులు కృష్ణ, సంతోష్‌యాదవ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

- జనావాసాల మధ్య డంప్‌యార్డ్‌లు
- భయాందోళనలో స్థానికులు
- కనీస జాగ్రత్తలు పాటించని నిర్వాహకులు


జల్‌పల్లిలో కొనసాగుతున్న పరిశ్రమలు


ఇటీవల శ్రీరాం కాలనీ ప్లాస్టిక్ గోదాంలో ఎగిసిపడిన మంటలు

పహాడీషరీఫ్: జనావాసాల మధ్య అక్రమంగా కొనసాగిస్తున్న డంప్‌యార్డుల నుంచి వస్తున్న దుర్గంధంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. డంప్‌యార్డులను మూసివేయాలని స్థానికులు పలుమార్లు నిర్వాహకులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇది జల్‌పల్లి మున్సిపాలిటీలో కొనసాగుతున్న డంప్‌యార్డ్ పరిస్థితి. ఒకవైపు వ్యర్థాల నుంచి వస్తున్న దుర్వాసనతో విషజ్వరాలు ప్రబలుతుండడం, మరోవైపు ఎప్పుడు ఎలాంటి అగ్ని ప్రమాదం సంభవిస్తుందో తెలియక స్థానికులు బిక్కుబిక్కుమంటూ గడపాల్సిన దుర్భర పరిస్థితులు నెలకొన్నాయి. వేసవి కాలం ప్రారంభం కావడం.. నిత్యం ఏదో ఒక చోట డంప్‌యార్డ్‌లలో అగ్ని ప్రమాదాలు జరుగుతుండడం చూసి స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా జల్‌పల్లి కమాన్ రోడ్డు, శ్రీరాం కాలనీలలో సమస్య ఎక్కువగా ఉంది. అనధికార చెత్త పాయింట్ల వద్ద ప్లాస్టిక్, ఇతర విలువైన వ్యర్థాలను సేకరించి ఈ డంప్‌లలో పోగు చేస్తున్నారు. జనావాసాల నడుమ డంప్‌యార్డ్‌లను కొనసాగిస్తూ పెద్ద ఎత్తున చెత్త పోగు చేస్తుండడంతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. ఈ వ్యర్థాలలో దోమలు, ఈగలు వృద్ధ చెంది స్థానికులను రోగాల బారిన పడేస్తున్నాయి.

అవగాహన రాహిత్యంతో నిల్వ

డంప్‌యార్డ్‌ల్లోని వ్యర్థాల్లో అనేక రకాల వస్తువులు ఉంటుండడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంటుంది. చెత్తలో లభ్యమయ్యే ఇనుప వస్తువులు, పేలుడు స్వభావం కలిగిన వస్తువులను కూడా నిర్వాహకులు అవగాహన రాహిత్యంతో నిల్వ ఉంచుతున్నారు. ఇలాంటి సమయంలో ప్రమాదాలు జరిగితే తమ పరిస్థితి ఏమిటని బస్తీవాసులు ఆందోళన చెందుతున్నారు. వేసవి వచ్చిందంటే తరచూ ఏదో ఒక డంప్‌యార్డ్‌లలో అగ్నిప్రమాదం జరగడం పరిపాటిగా మారిందని వాపోతున్నారు. మంటలు అదుపుకాకపోతే తమ ఇళ్లు కూడా కాలిపోయే ప్రమాదం ఉందంటున్నారు. గతేడాది మార్చిలో జల్‌పల్లి కమాన్ రోడ్డులో జరిగిన ప్రమాదంలో స్క్రాప్ గోడౌన్ పక్కనే ఉన్న డీసీఎంలు కూడా అగ్నికి ఆహుతయ్యాయి. ఈ నెల 2వ తేదీన శ్రీరాం కాలనీలో ఇళ్ల నడుమ ఉన్న ప్లాస్టిక్ గోదాంలో మంటలు వ్యాపించడంతో స్థానిక ప్రజలు తీవ్ర భయకంపితులయ్యారు.

పర్యవేక్షణ అంతంతే..

మున్సిపాలిటీ పరిధిలో ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ గోదాంలు, చెత్త డంప్‌లను వెంటనే తొలగించాలని యూత్ అసోసియేషన్ సభ్యులు, స్థానికులు అధికారులకు పలుమార్లు విన్నవించారు. అప్పటివరకు స్పందిస్తున్న మున్సిపాలిటీ అధికారులు అనంతరం మిన్నకుండి పోతున్నారు. నాలుగైదు రోజులు తూతూమంత్రంగా మూయించి అనంతరం యథేచ్ఛగా తమ అక్రమ దందాలను కొనసాగిస్తున్నారు.

అధికారులు స్పందించాలి



మున్సిపాలిటీలో అక్రమంగా కొనసాగుతున్న డంప్‌యార్డ్‌లను వెంటనే తొలగించాలి. జనవాసాల నడుమ ఉన్న ఇలాంటి స్క్రాప్ గోదాంలతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం చోటు చేసుకుంటుందో తెలియని పరిస్థితి నెలకొంటుంది. చిన్న చిన్న వీధుల్లో ఏర్పాటు చేస్తున్న చెత్త డంప్‌ల వద్దకు ప్రమాదం జరిగితే ఫైరింజన్లు కూడా వెళ్లే పరిస్థితి లేదు. వేసవిలో ప్రమాదాలు ఎక్కువయ్యే అవకాశం ఉంది. అధికారులు స్పందించి వీటిని మూసి వేయించాలి.

– మురళీకృష్ణ, జల్‌పల్లి

శిశుమందిర్‌లో విద్యార్థులకు పోటీలు


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

బడంగ్‌పేట్: బడంగ్‌పేటలోని శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో ఆదివారం విద్యార్థులకు కబడ్డీ పోటీలు నిర్వహించారు. హైదరాబాద్, రంగారెడ్డి, వికారాబాద్, చేవేళ్ల, పరిగి తదితర జిల్లాలలోని శిశుమందిర్ పాఠశాలల విద్యార్థుల మధ్య భాగ్య నగర్ వైభవ్ పేరుతో కబడ్డీ, చెస్, క్యారమ్స్ పోటీలను నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. విజేతలుగా నిలిచిన జట్లకు, విద్యార్థులకు కీర్తి శేషులు పెద్దబావి పార్వతమ్మ జ్ఞాపకార్థం మెమొంటోలు, షీల్డులు అందజేశారు. పోటీల్లో 329 మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో విభాగ్ పౌర సంబంధాల ప్రముఖ్ పుష్పల వెంకటేశ్వర్‌రావు, పాఠశాల కార్యదర్శి దొడ్డి మల్లికార్జున్, విభాగ్ ఖేల్‌కూద్ ప్రముఖ్ ప్రేమ్‌కుమార్, విభాగ్ శైక్షణిక్ ప్రముఖ్ కాసోజు భూషణ్, పెద్దబావి సమరసింహారెడ్డి, కార్పొరేటర్ పి.సుదర్శన్‌రెడ్డి, సామ సంజీవరెడ్డి, హైదరాబాద్ జిల్లా సహ కార్యదర్శి ఎ.కృష్ణారెడ్డి, రామిడి శూరకర్ణారెడ్డి, పాఠశాల ప్రధానాచార్యులు డి.శేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, ప్రబంధకులు పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

కందుకూరు: మండల పరిధిలోని దాసర్లపల్లి ప్రభుత్వ పాఠశాలలో శనివారం రాత్రి శ్రీ జైగణేశ్ యూత్ ఆధ్వర్యంలో వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల నృత్యాలు, డ్యాన్సులు, నాటికల ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. ముఖ్య అతిథులుగా సీఐ మక్బూల్‌జానీ, ఎంఈఓ మనోహర్ హాజరై విద్యార్థులకు ఉపయోగపడే విషయాలను వారితో పంచుకున్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు టి.ఇందిరాదేవేందర్, మాజీ సర్పంచ్ బాలమణిఅశోక్, మాజీ ఉపసర్పంచ్ మంగాదేవి, వేద బ్రాహ్మణుడు రేవెల్ల రాజుశర్మ తదితరులు పాల్గొన్నారు.


వార్షికోత్సవంలో పాల్గొన్న సీఐ తదితరులు

నాగారం మదర్సా అభివృద్ధికి కృషి


మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి

జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి

మహేశ్వరం: నాగారం మదర్సా అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి అన్నారు. మండల పరిధిలోని నాగారం గ్రామంలో గల మదర్సాలో విద్యార్థుల జల్సా దస్తర్ బండి అరేబియా నూర్ ఉల్ ఉలోం కార్యక్రమానికి ఆదివారం ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఏ సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకొస్తే వాటిని త్వరితగతంగా పరిష్కరిస్తామన్నారు. అంతకుముందు నాగార మదర్సా కమిటీ సభ్యులు, మైనార్టీ విద్యార్థులు అనితారెడ్డిని కలిసి శాలువాతో ఘనంగా సన్మానించి సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్‌పర్సన్ మంచె పాండు యాదవ్, మాజీ సర్పంచ్‌లు లావణ్యలింగం, కావలి దశరథ, నాయకులు రాఘవేందర్ గౌడ్, సిద్దుల్‌గౌడ్, అన్వర్‌ఖాన్, అజాం, గౌస్‌ఖాన్, అంజద్‌ఖాన్, హాజీఖాన్, ఫిరోజ్ ఖాన్, షాబేర్, ఖాజా పాషా, బాబ్జానీ, హబీబ్, మదర్సా కమిటీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి


విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న అతిథులు

జెడ్పీటీసీ మహిపాల్

ఇబ్రహీంపట్నం రూరల్: గెలుపోటములను సమానంగా స్వీకరించాలని జెడ్పీటీసీ మహిపాల్ పేర్కొన్నారు. ఆదిబట్ల మున్సిపాలిటీ కేంద్రంలో గత కొద్ది రోజులుగా పల్లె రజనీకాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆదిబట్ల ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. పోటీలో మహాత్మ యూత్ మొదటి బహుమతి సాధించి రూ.44,444 నగదు, ట్రోఫీని కైవసం చేసుకుంది. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మర్రి నిరంజన్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు పల్లె గోపాల్‌గౌడ్, పల్లె బాల్‌రాజ్‌గౌడ్, ఆదిబట్ల మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్, శంకర్‌గౌడ్, సాయిబాబగౌడ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే తులేకలాన్‌లో ఎంఎంఆర్ యువసేన ఆధ్వర్యంలో టీపీఎల్ క్రికెట్ టోర్నమెంట్‌ను జెడ్పీటీసీ మహిపాల్ ప్రారంభించారు. మండల అధ్యక్షులు రవీందర్‌రెడ్డి, రమేష్, కరుణాకర్, సత్తు శశాంక్‌రెడ్డి, జగదీష్, శంకర్, శివ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం కోసం కృషి

షాద్‌నగర్: కాంగ్రెస్ ప్రజా సంక్షేమం కోసం కృషి చేస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో నందిగామ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ మాజీ సర్పంచులు, పీఏసీఎస్ డైరెక్టర్లు, ఎంపీటీసీలు సుమారు వెయ్యి మంది కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డిలు కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తుందన్నారు. అధికారం శాశ్వతం కాదని, అధికారం చేతికి వస్తే కార్యకర్తలకు ప్రజలకు అండగా నిలబడితేనే రాజకీయాల్లో అందరికీ భవిష్యత్ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మామి డి శ్యాంసుందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు జంగ నర్సింహ్మా, శివశంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నందిగామ: మండలంలోని పలు గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డిలు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

కేశంపేట: దైవచింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని అలివేలుమంగ సమేత శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం అంతరాష్ట్ర ఎద్దుల పందెం బండలాగుడు పోటీలను గ్రామస్తులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, సీడబ్ల్యూసీ చల్లా వంశీచంద్ రెడ్డిలు పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. స్త్రీశిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి, ఎంపీటీసీ సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలియో రహిత సమాజానికి సహకరించాలి


మహేశ్వరం: చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న ఇన్‌చార్జి ఎంపీపీ సునీతానాయక్

కందుకూరు: పోలియో రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని మండల వైద్యాధికారిణి డాక్టర్ రాధిక అన్నారు. మండల పరిధిలో ఆదివారం పల్స్ పోలియో చుక్కల పంపిణీ 95.2 శాతం పూర్తయిందని ఆమె తెలిపారు. 5 ఏళ్లలోపు పిల్లలు 12,131 మందికి గాను 11,558 మందికి పోలియో చుక్కలు వేసినట్లు తెలిపారు. బస్టాండ్‌ల వద్ద మొబైల్ బృందాల ద్వారా చిన్నారులకు పోలియో చుక్కలు వేశామని, మిగిలిన పిల్లలకు మరో రెండు రోజుల్లో గ్రామాల్లో ఇంటింటికీ సిబ్బంది వెళ్లి పోలియో చుక్కలు వేస్తారన్నారు. కాగా కందుకూరు చౌరస్తాలో డాక్టర్ రాధిక, కొత్తగూడ, పులిమామిడి గ్రామాల్లో డాక్టర్ పద్మావతి, రాచులూరు పీహెచ్‌సీ పరిధిలో డాక్టర్ హరినాథ్, లేమూరు పీహెచ్‌సీ పరిధిలో డాక్టర్ రాజ్‌కుమార్ పల్స్ పోలియో చుక్కల కార్యక్రమాన్ని ప్రారంభించారు. కాగా పులిమామిడిలో నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్ మండల మహిళా మాజీ అధ్యక్షురాలు బుక్క ప్రశాంతిపాండురంగారెడ్డి పాల్గొన్నారు.

తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలి

హుడాకాంప్లెక్స్: పిల్లల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ప్రభుత్వం మూడురోజుల పాటు నిర్వహించే పోలియో చుక్కల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సరూర్‌నగర్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అన్నారు. ఆదివారం పోలియో చుక్కల కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లో, బస్‌స్టేషన్, రైల్వేస్టేషన్ లాంటి అనేక రద్దీ ప్రాంతాల్లో పోలియో చుక్కలు వేయనున్నారని తెలిపారు. చిన్నారుల నిండు జీవితానికి రెండు చుక్కల పోలియో డ్రాప్స్ వేయించాలని కోరారు.

పాత గ్రామ పంచాయతీ కార్యాలయంలో..

మహేశ్వరం: పోలియో రహిత సమాజం నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలని ఇన్‌చార్జి ఎంపీపీ కె.సునీతా నాయక్ పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని మహేశ్వరం పాత గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, వైద్యాధికారులతో కలిసి పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిన్నారులను పోలియో భారీ నుంచి కాపాడడానికి ప్రతి ఒక్కరూ ఆరోగ్య శాఖకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మహేశ్వరం ఎంపీటీసీ పోతర్ల సుదర్శన్ యాదవ్, బీజేపీ నాయకులు శ్రవణ్, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో..

పోలియో చుక్కలు వేయించి ప్రతి ఒక్కరూ సిబ్బందికి సహకరించాలని దుబ్బచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా.మల్లికార్జున్ పేర్కొన్నారు. ఆదివారం దుబ్బచర్ల ప్రభుత్వ ఆస్పత్రి, మండల కేంద్రం ఆరోగ్య కేంద్రాల్లో పిల్లలకు పల్స్ పోలియో చుక్కల కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యులు డా.అజయ్, డా.సౌమ్య, ఎంపీహెచ్ఓ నర్సింహ, సూపర్‌వైజర్లు జలీల్, రాజు, సువర్ణ, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.


మహేశ్వరం: సాదత్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో..


కందుకూరు: కొత్తగూడలో పోలియో చుక్కలు వేస్తున్న డాక్టర్ పద్మావతి తదితరులు


కందుకూరు: పులిమామిడిలో..


పహాడీషరీఫ్: వాదే ముస్తఫాలో..


బడంగ్‌పేట్: బడంగ్‌పేట్‌లో చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న మేయర్ పారిజాత


పహాడీషరీఫ్: షాహిన్‌నగర్‌లో..


మహేశ్వరం: నాగారంలో..

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం


విద్యార్థుల యోగా ప్రదర్శన

కడ్తాల్: యోగాసనాలతో ఆరోగ్యమయ జీవనం సాధించవచ్చని పర్యావరణ బాల చైతన్య కేంద్రాల నిర్వాహకులు రజనీకాంత్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని చరికొండలో కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ ఆధ్వర్యంలో బాల చైతన్య కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చిన్నారుల యోగాసనాల ప్రదర్శన, వృద్ధులకు, రైతులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. బాలచైతన్య కేంద్రం గ్రామ ఇన్‌చార్జి మమత అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రజనీకాంత్ మాట్లాడుతూ.. వృద్ధులు, రైతుల సంక్షేమానికి ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు. రైతు బాగుంటేనే దేశం బాగుంటుందని, దేశానికి అన్నం పెట్టే రైతన్నలకు ప్రభుత్వాలు అండగా నిలవాలని కోరారు. వృద్ధుల పట్ల పిల్లలు ప్రేమ, గౌరవం కలిగి ఉండాలని అందుకు తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. అనంతరం వృద్ధులను, రైతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ అద్దాల రాములుగౌడ్, మాజీ సర్పంచ్ నర్సింహగౌడ్, ఉమా, నాగరాణి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.